క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

పుల్లలచెరువు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి తప్పని సరిగా ఎంపీటీసీలు, అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సాయిబాబా ఆలయంలో పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పుల్లలచెరువు: మండలంలోని ఉమ్మడివరంలో వేంచేసి ఉన్న సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి శంకర్ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉపాధ్యాయుడు రామిరెడ్డికి సన్మానం


రామిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఏపీయూఎస్ నాయకులు

దర్శి: గత నెలలో స్వచ్ఛందంగా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు డీవీ రామిరెడ్డి దంపతులను ఏపీయూఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆ సంఘ నాయకుడు కె.వీరాచారి మాట్లాడుతూ విధి నిర్వహణలో వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న రామిరెడ్డి ఇప్పటి వరకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సుబ్బారావు, వి.శివకుమార్, కె.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకికి నివాళి


అయ్యంకికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


పెద్దారవీడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవల గురించి వివరించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో బాబా

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెం, కొత్తపాలెం, వెలుగువారిపాలెం సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పూజారులు బాబాను ప్రత్యేకంగా అలంకరించి గణపతి పూజ చేసి హారతులు అందించారు. గురువారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మార్కాపురంపై డ్రోన్లతో నిఘా


ఇంటిని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగా డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ పి.సుబ్బారావు పేర్కొన్నారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న అనుమానం ఉన్న పలు ప్రాంతాలను గురువారం డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించినట్లు తెలిపారు. తర్లుపాడు రోడ్డు, అల్లూరిపోలేరమ్మ గుడి ఏరియా, ఇందిరమ్మకాలనీ, చెన్నరాయునిపల్లి ప్రాంతాలపై నిఘా ఉంచామన్నారు. కాగా అనుమానాస్పదంగా ఉన్న ఒక ఇంటిని సీఐతోపాటు ఎస్సై రాజమోహన్‌రావు, పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు.

ఒకే ఒక్కడు!

- ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు


విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ప్రధానోపాధ్యాయుడు


గుండంచర్ల ఎంపీపీ స్కూల్ తరగతి గదిలో లేని ఉపాధ్యాయుడు

పెద్దారవీడు:

మండలంలోని గుండంచర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 74 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి బోధించేందుకు ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. పాఠశాలలో 21 మంది విద్యార్థులు దాటితే అదనంగా ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంది. ఇక్కడ ఆ అపరిస్థితి కనిపించడం లేదు. ఒక ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సిన పాఠశాలలో ఒక్కరే ఉన్నారు. అది కూడా హెచ్‌ఎం బాధ్యతలు నిర్వహిస్తూ పాఠాలు చెబుతున్నారంటే విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం ఏ పాటిదో అర్థమవుతోంది. మండలానికి దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పాఠశాలలో బోధన కుంటుపడుతున్నా మండల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 50 శాతం మంది ఉపాధ్యాయులు పాఠశాలలో ఉంటేనే బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలనే నిబంధనలు ఉన్నా ఎలా రిలీవ్ చేశారో విద్యాశాఖ అధికారులకే తెలియాలి. సమీప పాఠశాలల నుంచి అయినా డిప్యూటేషన్ వేయాల్సి ఉన్నా కాలయాపన చేస్తుండటంతో విద్యా బోధన కుంటుపడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

తాగునీరు లేక అవస్థలు

మధ్యాహ్నం భోజనం చేసేటప్పుడు తాగునీరు అందుబాటులో లేకపోవడంతో ఇంటి నుంచి బాటిళ్లతో మంచినీరు తెచ్చుకుంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల అవరణలో తాగునీటి బోరు లేదు. కూటమి ప్రభుత్వం అవసరమైనంత మంది ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందించలేకపోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం లెక్క ప్రకారం ఇక్కడ హెచ్‌ఎంతో సహా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. దీంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొని ఉంది. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. గత విద్యా సంవత్సరం వరకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారు. సాధారణ బదిలీలపై ఇతర పాఠశాలలకు వెళ్లారు. రెండేసి తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోపెట్టి బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ ఇక్కడ ఇదే సమస్యతో ప్రధానోపాధ్యాయుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు కొరతను భర్తీ చేసి పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న నీటి బాటిళ్లు


గుట్టమీదపల్లెలో కంది నాటుతున్న కూలీలు

ముమ్మరంగా వ్యవసాయ పనులు

దొనకొండ: గ్రామాల్లోని రైతులు రెండు రోజుల నుంచి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. చాలా రోజుల నుంచి వర్షాలు లేక పోవటం, ఖరీఫ్ సీజన్ దాటి పోవటం, వరుణ దేవుడు కొద్ది మేర కనికరించటంతో భూమి పదునెక్కింది. దీంతో రైతులు వాణిజ్య పంటలైన కంది, పత్తి, ఆముదం పంటలు సాగుకు సన్నద్ధమయ్యారు. గతేడాది పంటలు పండించుకున్నా గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాదైనా సరైన వర్షాలు పడి పండిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశతో వేలకు వేలు ఖర్చు చేసి పొలాలు దుక్కి వేసి దూర ప్రాంతాలైన వినుకొండ, నరసరావుపేట తదితర ప్రాంతాలకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేసి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

శ్రావణ శుక్రవారానికి అమ్మవారు సిద్ధం


జ్ఞానప్రసూనాంబ అమ్మవారు


కాళహస్తీశ్వరస్వామి

కురిచేడు: శ్రావణమాసం ఆరంభం శుక్రవారం కావడంతో కురిచేడు లోని శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరాలయంలోని శ్రీ జ్ఞానప్రసూనాంబ భక్తులతో పూజలందుకునేందుకు సిద్ధమైంది. శ్రావణ శుక్రవారం జరిగే ప్రత్యేక పూజకు భక్తుల రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, స్వామి వారికి అభిషేకాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పూజా సామగ్రితో ఉదయం 5 గంటల నుంచి జరిగే పూజల్లో పాల్గొనవచ్చని చెప్పారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి


ఇంటింటా ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

దర్శి: సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి కోరారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ బృందం దర్శిలో ఇంటింటికీ సీపీఐ పేరుతో గురువారం ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ 100 సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో మొట్టమొదటిసారి ఒంగోలులో ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర మహాసభలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. 23వ తేదీన జరిగే శ్రమజీవుల శంఖారావం సభకు 50 వేల మంది హాజరవుతారని తెలిపారు. మహాసభలో ప్రతి ఇంటి నుంచి ఒక వ్యక్తి వచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. విరివిగా విరాళాలు ఇచ్చి మహాసభల జయప్రదానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు కల్లూరు పెద్ద ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.రామాంజి యాదవ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు గొంగటి స్టాలిన్, శివ, జగదీష్, సాధిక్, కార్తీక్, సిద్దు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్ల తొలగింపు


జేసీబీతో చిల్ల చెట్లు తొలగింపజేస్తున్న ఎస్ఐ త్యాగరాజు

దొనకొండ: స్థానిక కేజీబీవీ పాఠశాల ఎదుట రోడ్డు పక్కన చిల్లచెట్లు పెరగడంతో వాహన చోదకులు, పాదాచారులు ప్రయాణించేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. అర్ధ చంద్రాకార మలుపు, స్పీడు బ్రేకర్లు లేక పోవడంతో తరుచూ అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే దారిలో ప్రభుత్వ కార్యాలయాలకు అధికారులు, ప్రజలు నిత్యం వెళ్తుంటారు. ఇటీవల సుమారుగా 10 ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. స్పందించిన ఎస్ఐ టి.త్యాగరాజు రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా ప్రమాదాలు నివారించేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను గురువారం తొలగింపజేశారు. స్థానికులు ఎస్ఐకు కృతజ్ఞతలు తెలిపారు.

బురద రోడ్డుపై నరకం


నిర్మల కాన్వెంట్ వద్ద రోడ్డు దుస్థితి ఇలా..

పొదిలి: పట్టణ పంచాయతీగా రూపాంతరం చెందిన పొదిలిలో ప్రధాన వీధులు ఎంత దారుణంగా ఉన్నాయో ఈ చిత్రాలు తెలియజేస్తున్నాయి. స్థానికులు విరాట్ నగర్‌గా పిలుచుకునే నిర్మలా కాన్వెంట్ రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. జగనన్న కాలనీ, పిచ్చిరెడ్డితోట, విరాట్‌నగర్, నిర్మలా కాన్వెంట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రజలు, విద్యార్థులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై బురద పేరుకుపోవడంతో నడిచి వెళ్లేవారు అడుగు తీసి అడుగేసే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు జనాన్ని మరింత ఇబ్బందికి గురిచేస్తున్నాయి. పురపాలనాధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


విరాట్ నగర్ సమీపంలో..

జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారికి అమావాస్యను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయశర్మ జగదాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా చౌడేశ్వరి మాత జయంతి


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

కొనకనమిట్ల: మండలంలోని మునగపాడు గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలను పురస్కరించుకుని గురువారం విశేష పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. నాగేటి సాళ్లలో ఉద్భవించిన అమ్మవారిని గ్రామంలోని తొగటవీర క్షత్రియులు కులదేవతగా ఆరాధిస్తారు. ఈ ప్రాంత ప్రజలు తమ సంతానానికి చౌడయ్య, చౌడమ్మ, చౌడేశ్వరి అనే పేర్లు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పూజల అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

జ్యోతిష్య సిద్ధాంతి సురేష్‌కు వాస్తు విధ్వన్మణి పురస్కారం



సురేష్‌కు పురస్కారం అందిస్తున్న కమిటీ సభ్యులు

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి డాక్టర్ అమరా సురేష్‌కు బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో పరాశరాస్ అకాడమీ ఆఫ్ ఆస్ట్రో సైన్సెస్ ప్రతినిధులు వాస్తు విధ్వన్మణి పురస్కారాన్ని అందజేశారు. జ్యోతిష్య, వాస్తు శాస్త్రం, సనాతన ధర్మం పరిడవిల్లేందుకు సురేష్ చేస్తున్న కృషికి గుర్తింపుగా పరాశరాస్ సంస్థ ప్రతినిధి మహేష్‌చంద్ర భరద్వాజ్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సురేష్‌ను పురప్రముఖులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈకేవైసీపై అవగాహన


కార్యకర్తలకు సూచనలిస్తున్న సీడీపీవో పద్మావతి

పుల్లలచెరువు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని తల్లులకు, పిల్లలకు ఈకేవైసీ ఎలా చేయాలనే దానిపై సెక్టార్ పరిధిలోని కార్యకర్తలకు గురువారం మండల కేంద్రం పుల్లలచెరువులో అవగాహన కల్పించారు. సీడీపీవో పద్మావతి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి కేంద్రంలో పిల్లలకు, తల్లులకు సంబంధించిన ఆధార్‌లో ఈకేవైసీ చేయించాలన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మీబాయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి


జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కురిచేడు: మండల కేంద్రంలో మహాకవి గుర్రం జాషువా వర్ధంతిని గురువారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కంభంపాటి జోసెఫ్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాస్ మాదిగ, నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి యోగేశ్వరరావు మాదిగ హాజరయ్యారు. ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఏసుదాస్ మాట్లాడుతూ గుర్రం జాషువా రచించిన రచనలు గుర్తు చేసుకుంటూ గబ్బిలం, ఫిరదౌసి, ముంతాజ్ మహల్, క్రీస్తు చరిత్ర ద్వారా సమాజంలో ఉండే కుళ్లుని కడిగిపడేశారన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు కంభంపాటి అనిల్ మాదిగ, టౌన్ అధ్యక్షుడు కంభంపాటి ప్రశాంత్ మాదిగ, కంభంపాటి బాబూరావు మాదిగ, విద్యార్థి సంఘ నాయకులు కంభంపాటి లక్ష్మణ్ మాదిగ, కేసనపల్లి వంశీమాదిగ, మురుగుల మరియబాబు మాదిగ పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జున్

ముండ్లమూరు (దర్శి): గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కమలాకర్ అన్నారు. మండలంలోని మారెళ్ల న్యూ జనరేషన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు గురువారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశలోనే పెంపొందించే విధంగా ప్రణాళిక బద్ధంగా వెళ్తూ చదువులో ముందంజలో ఉండాలని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యుడు మధుశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స వివరాల గురించి విద్యార్థులకు తెలిపారు. పాఠశాలలో ఆటల పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన విజేతలు సందీప్, ప్రవస్తిని, అఖిల్, ఆరాధ్య ప్రియలకు పాఠశాల డైరెక్టర్ శ్రీలత బహుమతులు ప్రదానం చేశారు. మండల విద్యాశాఖాధికారులు కాలేషావలి, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ఆదాం పాల్గొన్నారు.